వివిధ కోర్సుల పరీక్షా
ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్, ఓఎల్ సీసీ, పీడీసీ తదితర కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

'విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: విద్యార్థులు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు పొందవచ్చని పలువురు అధ్యాపకులు సూచించారు. సంబంధిత రంగంలో జ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకోవాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ విభాగం విద్యార్థులకు ఐదు రోజుల పాటు 'క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' నిర్వహిస్తున్నారు. ఈసీఈ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఈసీఈ విభాగం హెడ్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, డాక్టర్ ఉపేందర్, రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాల వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు.

చెత్త తొలగింపులో జాప్యం లేదు

ముషీరాబాద్, జూలై 15: ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ప్రతి ఉదయం చెత్త తొలగింపు పనులు చేపడుతున్నట్లు జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముషీరాబాద్ ప్రధాన మార్గంలో చెత్త పేరుకుపోయినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, రోజు ఉదయం చెత్త తొలగించిన తరువాత సున్నం చల్లడం జరుగుతుందన్నారు.

ఎల్వోసీ అందజేత

ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయొద్దని, మెరుగైన వైద్యం పొందాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌కు చెందిన దశరథ్‌కు సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల మంజూరు పత్రాన్ని ఆయన లబ్ధిదారుడికి అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన దశరథ్‌కు కిడ్నీ సమస్య రావడంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం తనకు ఆర్థిక సహాయం అందించాలని ఆయన ఎమ్మెల్యే తలసానిని కలిసి కోరారు. తలసాని చొరవ తీసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం సిఫారసు చేయగా, లక్ష రూపాయలు మంజూరయ్యాయి. తన వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించడానికి చొరవ చూపిన ఎమ్మెల్యే తలసానికి దశరథ్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మీపతి, అబ్బాస్‌లు పాల్గొన్నారు.

– బన్సీలాల్‌పేట్, జూలై 15

ఎల్లమ్మ సన్నిధిలో..! బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కె.నవీన్‌రావులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారి దర్శనానికి వచ్చిన వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు వీరికి అమ్మవారి శేష వస్త్రాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– అమీర్‌పేట్, జూలై 15

క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేత

మారేడ్‌పల్లి, జూలై 15: క్రీడాకారులకు తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. సోమవారం ఓల్డ్ విజన్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్ట్రీట్ చిల్డ్రన్ ప్రాజెక్ట్‌లో భాగంగా అంబేద్కర్‌నగర్‌కు చెందిన క్రీడాకారులకు ఎమ్మెల్యే క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కంటోన్మెంట్‌లోని క్రీడాకారులందరికీ తమ సహకారం ఉంటుందని, ఆయా క్రీడల్లో రాణించి మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. రానున్న రోజుల్లో కంటోన్మెంట్‌లోని ఆయా క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ విజన్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘటం ఊరేగింపు: రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ గండి మైసమ్మ ఆలయ ఘటాల అలంకరణోత్సవం, పూజా కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నంది కంటి రవి ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాన్ని పూలతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఘటం ఆలయం నుంచి ప్రారంభమై రెజిమెంటల్‌బజార్‌లోని పురవీధుల్లో ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబురావు, అల్లాడి గౌరీశంకర్, నీలాంకర్, ఆనంద్, కె. శ్రీనివాస్, సుజన్ ముదిరాజ్, రాంపల్లి గోపి బాబు, మల్లేష్, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

– మారేడ్‌పల్లి, జూలై 15:

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

సంఘం ప్రతినిధులకు రూ.20వేల విరాళాన్ని అందజేస్తున్న ర్యాల రాజేందర్ యాదవ్

అడ్డగుట్ట, జూలై 15 : ర్యాల అడవయ్య యాదవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలగూడ ధోబీఘాట్‌లోని అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20 వేల విరాళాన్ని క్రాంతి రజక సంఘం ప్రతినిధులకు సోమవారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ర్యాల రాజేందర్ యాదవ్‌ను సంఘం సభ్యులు కలిసి కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన సంఘం ప్రతినిధులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ...ఆలయాలను అభివృద్ధి చేయాలన్నది తమ లక్ష్యమన్నారు. రానున్నకాలంలో సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉమాకాంత్, రమేష్, వెంకటేష్, శంకర్, గౌరయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా
చర్యలు తీసుకోండి

అడ్డగుట్ట, జూలై 15 : మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను అడ్డగుట్ట బీజేపీ నాయకులు సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. డివిజన్‌లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సీవరేజ్, మంచినీటి పైపులైన్ పనులను పూర్తి చేసిన ప్రదేశం నుంచి వెలువడిన మట్టికుప్పలను తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా రోడ్లు గుంతలమయంగా మారాయని, బోనాల ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణమే ప్రధాన, అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వారు జీఎంను కోరారు. బోనాలు తీసుకొచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీఎంను కలిసిన వారిలో సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజు, నేతలు మహేందర్, ఉదయ్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

జీఎం వినోద్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

సీజనల్ వ్యాధులపై అవగాహన

సికింద్రాబాద్, జూలై 15 : సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జీహెచ్ ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ వై శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఉదయం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మేడిబావి కాకతీయ హైస్కూల్‌లో దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.వర్షా కాలంలో దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి శుక్రవారం ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్‌లలో డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఇండ్లల్లో ఉన్న పూల కుండీలు, టైర్లు, కొబ్బరిబోండాలు తదితర వాటిలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.ప్రతి వారం విద్యార్థులకు ,వారి క్లిదండ్రులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్కూల్ టీచర్లు,ప్రిన్సిపాల్ లక్షణ్ పాల్గొన్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
మహిళలతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

మారేడ్‌పల్లి, జూలై 15 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు కాకాగూడ బస్తీలో సోమవారం స్థానిక మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు బస్తీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బస్తీలో బోర్ వెల్, డ్రైనేజీ, రోడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆకతాయిలు గంజాయి తాగుతూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... ఇటీవల కాలంలోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, మీ సమస్యలన్నీ తనకు తెలుసునని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలు ఏమైనా ఉంటే ఎమ్మెల్యే నిధులు వెచ్చించి శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు వెల్లడించారు. మహిళలందరూ స్వయం శక్తితో ఎదిగే విధంగా తన వంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ముఖ్యంగా బస్తీలో గంజాయిని సేవించే వారిపై ప్రత్యేక దృష్టిని సారించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కార్ఖానా పోలీసులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకురాలు శ్యామల, తిరుమల, రజిని, పద్మా ,రేపాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

విద్యార్థులను ఉద్దేశించి దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: దోమల నివారణకు ప్రజల సహకారం అవసరమని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు కేటాయించి, తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. తద్వారా హాని కలిగించే దోమలు, కీటకాలను నివారించడం సాధ్యమవుతుందని చెప్పారు. 'డ్రైడే – డ్రై డే'పేరుతో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం పట్ల బౌద్ధనగర్ లోని మదర్ మేరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంది శైలజ హాజరై మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమంలో శక్తి వంచన లేకుండా సేవలందించాలని సూచించారు. ముఖ్యంగా వర్షా కాలం కావడంతో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, డాక్టర్ ఎలిజబెత్, ఆశ వర్కర్లు, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డా నాయకుడు మహేశ్ మృతి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: తార్నాక లేబర్ అడ్డా నాయకుడు మహేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. బీజేపీ జిల్లా కార్యదర్శి మలికంటి వీరన్న మహేశ్ మృతదేహానికి నివాళులర్పించారు. మహేశ్ సొంత ఊరు విజయవాడకు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు లేబర్ అడ్డాకు చెందిన పలువురు మరింత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ అడ్డా నాయకులు పెయింటర్ రాజు, ఆటో మల్లయ్య, రవి, నరేశ్, దశరథ్, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

మహేశ్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మలికంటి వీరన్న, లేబర్ అడ్డా నాయకులు

భక్తి ఉద్యమంలో మహిళల పాత్ర గొప్పది
ప్రొఫెసర్ రేఖా పాండే

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రేఖా పాండే

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: భారత దేశంలో మధ్యయుగంలో ప్రారంభమైన భక్తి ఉద్యమంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసర్చ్ అండ్ ఇంటర్‌ఫేత్ స్టడీస్ – హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ గౌరవ ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ హిస్టరీ విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ రేఖా పాండే అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగంలో 'డివైన్ సౌండ్స్ ఫ్రమ్ ది హార్ట్: వుమెన్ ఇన్ భక్తి మూవ్‌మెంట్' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రేఖా పాండే మాట్లాడుతూ ఈ భక్తి ఉద్యమం ద్వారా భారతీయ చరిత్రలో సింక్రెటిక్ సంస్కృతి ఆవిర్భావానికి మార్గం సుగమం అయిందన్నారు. మీరాబాయి వంటి మహిళా సాధువులు ఆధ్యాత్మిక సంపన్నతకు మాత్రమే కాకుండా కుల ఆధారిత వివక్ష, ఆధిపత్య మతపరమైన వివక్ష, లింగ అసమానతలకు వ్యతిరేకంగా తన నిరసనను వినిపించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయీదా తలత్ సుల్తానా, హిస్టరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ బి. లావణ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇందిర, డాక్టర్ పి. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

రాష్ట్ర నూతన డిజీపీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జితేందర్‌ను సోమవారం రాష్ట్ర హోంగార్డ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొత్వాల్ దయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఓయూలో అక్రమ అరెస్టులు..ఉద్రిక్తం

- తెల్లవారుజామునుంచే విద్యార్థి నాయకుల అరెస్టు
- హాస్టళ్లు, ఇళ్లలోకి బలవంతంగా ప్రవేశించి, అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు
- హెచ్చరించిన విద్యార్థి నేతలు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ముట్టడికి నిరుద్యోగులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తెల్లవారుజామునుంచే విద్యార్థి నాయకుల అరెస్టులు కొనసాగాయి. హాస్టళ్లు, ఇళ్లు తేడా లేకుండా బలవంతంగా లోనికి ప్రవేశించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల సంఖ్యను పెంచి, పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థి లోకానికి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తుంటే విద్యార్థులను ఎక్కడికక్కడ కట్టడి చేస్తూ ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై విరుచుకుపడిన మేధావులు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న అహంకార మాటలను ఎందుకు ఖండించడం లేదని దుయ్యబట్టారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరంతరం విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఇం దులో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వారికి మద్దతుగా ఉంటామని చెప్పారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, నాయకులు జీడీ అనిల్, కొంపల్లి నరేశ్, మిథున్ ప్రసాద్, రమేశ్‌గౌడ్, అవినాశ్, విజయ్‌నాయక్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు.

బీఆర్ఎస్వీ నాయకుడు మిథున్‌ను వాహనం ఎక్కిస్తున్న పోలీసులు

సమావేశంలో మాట్లాడుతున్న సైకాలజిస్టు గంప నాగేశ్వర్ రావు

రాష్ట్రపతి నిలయంలో యువత
నైపుణ్య వేడుకలు

బొల్లారం,జూలై 15: ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సైకాలజిస్టు గంప నాగేశ్వర్ రావు,ఎడ్యుకేషన్ వ్యవస్థాపకురాలు యువనేశ్వరి,చరణ్ రాజు,గణిత శాస్త్రజ్ఞులు చంద్రయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ...సమాజంలో విద్యార్థుల పాత్రను,ప్రభావాన్ని అభివృద్ధి పరిచేందుకు యువత నైపుణ్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు.అనంతరం గణిత శాస్త్రజ్ఞులు చంద్రయ్య గణితం–స్వయం ఉపాధి కళ అని గణిత జ్ఞానంతో మేజిక్ ప్రదర్శించి అలరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయ అధికారి రజినీ ప్రియ,వివిధ విద్యా సంస్థల చైర్మన్లు,సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు,నాలా పరీవాహక ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ హేమ జీహెచ్ఎంసీ సిబ్బంది, నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.ఇందిరానగర్ రోడ్డు నెంబర్ 4లో రోడ్డకు అడ్డంగా చెట్టు పడి పోయిన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ హేమ ఆ ప్రాంతానికి చేరుకుని పడిపోయిన చెట్టు తొలగింపుకు సంబంధిత అధికారులతో మాట్లాడాడి తొలగింప జేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని, అందుకు నాలా పరీవాహక,లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఇందిరానగర్ కాలనీలో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్‌లో కూలిన గోడ

బౌద్ధనగర్‌లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి డివిజన్ లోని ఎల్ఎన్ నగర్‌లో ఓ గోడ కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ ప్రదేశాన్ని స్థానిక కార్పొరేటర్ కంది శైలజ జీహెచ్ ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతేనే ఇండ్ల నుంచి బయటకు రావాలన్నారు.

బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ

అనారోగ్యంతో వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జూలై 15 : అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామదాల్ (39) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న మృతుడు తన ఆరోగ్యం బాగాలేదని కర్నూల్ సిటీ నుంచి లక్నో వెళ్లడానికి రైల్లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంకు వచ్చాడు. ప్లాట్ ఫారం నంబర్ 2 లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద మృతుడు రామదాల్ పడుకొని అక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.